ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 6 మార్చి 2025 www.prajaaswaramdaily.com 2 pm



# కల్యాణ వైభోగమే..

## ఘనంగా సీతారాముల పెళ్లి వేడుక

భద్రాచలం: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తన సతీమణి గీతతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. అభిజిత్ లగ్నంలో శ్రీరామ చంద్రమూర్తి సీతమ్మవారి మెడలో మాంగళ్య ధారణ చేశారు. మిథిలా మైదానంలో ఈ కల్యాణ క్రతువును ఆలయ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులన్నీ రామ నామస్మరణతో మార్మోగాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.





### ప్రధాని మోదీ .. సబ్ కా వికాస్ తో

# రామ మార్గంలో పయనం

**గవర్నర్ జిష్ణుదేవ్**

**సీతారాంబాగ్ ఆలయంలో ఆయనకు ఘన స్వాగతం**

**ప్రత్యేక పూజలు చేసిన వర్మ**

**ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్**




హైదరాబాద్ : శ్రీ రామ నవమి పర్వదినం సందర్భంగా గోషా మహల్ లోని సీతారాం బాగ్ ఆలయంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం పూజరులు గవర్నర్ కు ఘన స్వాగతం పలికి వేద ఆశీర్వాదం ఇచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. అది గురు శంకరచార్య దేశానికి నాలుగు వైపుల ధర్మ పరిపరక్షణకు మఠాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. “ధర్మాన్ని ఎవరు రక్షిస్తారో వారిని ధర్మం రక్షిస్తుంది. రాముడు ఏం చేసినా ధర్మ రక్షణకోసం చేశాడు. భగవాన్ రామ్ ధర్మ స్థాపనకు మార్గదర్శకుడు. భారత దేశా సంసృతి.. సంప్రదాయాలకు రాముడు ఆదర్శం. ప్రతి పౌరుడు భగవాన్ శ్రీరామ్ ను ఆదర్శం తీసుకోవాలి. ఆయన మార్గంలో నడిచి దేశాభివృద్ధికి పాటు పడాలి. ప్రధాని మోడీ సబ్ కా సబ్ కా వికాస్ పేరుతో రామ మార్గంలో నడుస్తున్నారు.” అని వ్యాఖ్యానించారు.

గవర్నర్ రాష్ట్ర ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. కాగా.. అనంతరం భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి శోభయాత్రను గవర్నర్ ప్రారంభించారు. ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శోభా యాత్రకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీతారాంబాగ్ ఆలయం నుంచి కోఠి హనుమాన్ టెకడి వరకు వేలాది మంది భక్తుల ర్యాలీగా ఈ శోభయాత్ర నిర్వహించనున్నారు.

# బాలరాముడికి సూర్యతిలకం

**పరవశించిపోయిన భక్తజనం**

అయోధ్య : శ్రీరాముడి జన్మస్థలం అయోధ్యలో ‘శ్రీరామ నవమి’ 2025 వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఆలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత జరుగుతోన్న రెండో వేడుకలు ఇవి. సూర్యకిరణాలు రామ్ లల్లాకు మధ్యాహ్నం 12 గంటలకు నాలుగు నిమిషాల పాటు తిలకం పట్టాయి. ‘సూర్య తిలకం’ ను తిలకించి భక్తజనం పరవశించిపోయారు. అధునాతన సాంకేతికత సాయంతో సూర్యకిరణాలు గర్భగుడిలోని రాముడి విగ్రహం నుదుటిపై



తిలకం వలే 58 మిల్లీమీటర్ల పరిమాణంలో కొన్ని నిమిషాల పాటు ప్రసరించాయి. దీంతో స్వామి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు.

# సీఎం ఓ రబ్బర్ స్టాంప్

**కాంగ్రెస్ పాలన భ్రష్టుపట్టింది**

**ఆరు గ్యారంటీలు హుష్ కాకీ**

**కేంద్రమంత్రి బండి సంజయ్**

**కరీంనగర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరణ**



కరీంనగర్ : తెలంగాణలో కాంగ్రెస్ పాలన పూర్తిగా భ్రష్టుపట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు దిక్కులేకుండా పోయిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి రబ్బర్ స్టాంప్ లా మారిపోయారని, రాష్ట్ర పాలనను జన్ పథ్, గాంధీభవన్ ద్వారా నడిపిస్తున్నారని మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రివర్గంలో ఎవరు ఉండాలో కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయిస్తుందని పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని, ముఖ్యమంత్రి అధికారాన్ని కాంగ్రెస్ హైకమాండ్ హస్తగతం చేసుకోవడం బాధాకరమన్నారు. తెలంగాణను దోచుకుని ఢిల్లీ పెద్దలకు కప్పం కడుతున్నారని ఆరోపించారు. పాలనపై సీఎంకు పట్టులేకపోవడానికి హెచ్‌సీయూ భూముల వ్యవహారమే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అవినీతిపాలనను అంతం చేయాల్సిన సమయం వచ్చిందని తెలిపారు.

హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి మజ్లిస్ పార్టీకి ఓటేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. హైదరాబాద్‌ను మజ్లిస్‌కు అప్పగించేందుకు ఈ రెండు పార్టీలు పోటీపడుతున్నాయని చెప్పారు. మజ్లిస్ పార్టీ దేశద్రోహ పార్టీ అయితే, బీజేపీ దేశభక్తి పార్టీ అని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు దేశద్రోహ పార్టీకి, దేశభక్తి పార్టీకి మధ్య జరుగుతున్న ఎన్నికలుగా అభివర్ణించారు. హైదరాబాద్ కార్పొరేటర్లు, ఓటర్లు ఎవరి పక్షాన నిలవాలో ఆలోచించాలని సూచించారు. బీజేపీ అభ్యర్థి గౌతంరావు గెలుస్తారనే నమ్మకం ఉందని తెలిపారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చాలా కాలం కిందటే కుమ్మక్కయ్యాయని బండి సంజయ్ అన్నారు. చెన్నైలో డీలిమిటేషన్ సమావేశానికి ఈ రెండు పార్టీలు కలిసి హాజరయ్యాయని గుర్తుచేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కూడా కలిసి ఓటేశాయని ఆరోపించారు.

45 ఏళ్లుగా బీజేపీ అనేక ఒడిదొడుకులు, అవమానాలను ఎదుర్కొంటూ ముందుకు వచ్చిన పార్టీ అని, వేలాది మంది కార్యకర్తల బలిదానాలు, లక్షలాది మంది పోరాటాలతో బీజేపీ అధికారంలోకి వచ్చిందని చెప్పారు.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో స్వంతంగా, 6 రాష్ట్రాల్లో కూటమి ద్వారా బీజేపీ ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. మోడీ పాలనలో దేశం ఆర్థిక ప్రగతిలో అద్భుత ఫలితాలు సాధించిందని, కేంద్ర సంక్షేమ పథకాలను తెలంగాణలో పూర్తిగా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. అన్ని రాష్ట్రాలను సమాన దృష్టితో చూస్తూ అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం మోడీదేనని తెలిపారు. రేషన్ షాపుల్లో ప్రజలకు అందిస్తున్న బియ్యం మోడీ బియ్యమేనని స్పష్టం చేశారు.

### ఉత్తర తెలంగాణకు అద్భుతమైన ప్రాజెక్ట్

# కాళేశ్వరం

- ఈ ప్రాజెక్ట్ వల్లే పలు కంపెనీలు రాష్ట్రానికి రాక
- కాంగ్రెస్ పాలనలో నాలుగు ప్రాజెక్టులు కూలాయి
- మాజీ మంత్రి హరీష్ రావు



చిన్నకోడూరు : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు ప్రాజెక్టులు కూలిపోయాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. దీనికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లాలోని చిన్నకొడుర్ మండలం చౌడారం వద్ద బిక్కబండకు వెళ్లే కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం కాలువల భూ సేకరణ కోసం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు.

కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, ప్రాజెక్టుల్లో నీరు ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా నీటిని విడుదల చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రైతులపై ప్రేమతో పనిచేయాల్సిన అవసరం ఉందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పగతో వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఉత్తర తెలంగాణకు అద్భుతమైన ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ వల్లే పలు కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని హరీష్ రావు చెప్పారు..



# పట్టుబడిన రూ. 10 లక్షల కొకైన్

జహీరాబాద్ : ట్రావెల్స్ బస్సులో అక్రమంగా తరలిస్తున్న కొకైన్ ను ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం చిరాగ్ పల్లి 65వ జాతీయ రహదారిపై.. అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద టాస్క్ ఫోర్స్ బృందం సీఐ దుబ్బాక శంకర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. గోవా నుంచి హైదరాబాద్ కు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ వద్ద.. 10 లక్షల రూపాయల విలువైన 10 గ్రాములకు పైగా కొకైన్ లభించింది. డ్రైవర్ ఏపీలోని కృష్ణా జిల్లా బంటుమిల్లికి చెందిన చంద్రశేఖర్ గా గుర్తించారు. కొకైన్ ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. నిందితుడు చంద్రశేఖర్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు

### సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో

# సీఎం భోజనం

కొత్తగూడెం : సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంటిలో సీఎం భోజనం చేశారు. విషయానికొస్తే.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భసద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సారపాకలో పర్యటించారు. ఇక్కడ సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. వారి కష్టసుఖాల గురించి అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యులాలు తులసమ్మను ఆరా తీశారు. దొడ్డు బియ్యం పంపిణీ చేసినపుడు అసలు తీసుకునేందుకే ఆసక్తి చూపేవాళ్లం కాదని తులసమ్మ సమాధానమిచ్చింది. ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడంతో కుటుంబానికి ఉపయోగంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేసింది.